క్లుప్తంగా

సంఘాలను బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న మహిళలు

కెరమెరి: గ్రామైక్య సంఘాలను బలోపేతం చేయాలని ఐకేపీ సీసీలు జీవన్, ధన్‌రాజ్, శ్యాంరావు, సుజాత అన్నారు. బుధవారం మండలంలోని ఇందాపూర్, అగర్‌వాడ, సాంగ్వి, ధనోరా, తదితర గ్రామాల్లో మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. 22న మండల కేంద్రంలో నిర్వహించే మండల సమాఖ్య ఎన్నికల్లో సంఘంలో చురుకై న సభ్యులు పాల్గొనాలని సూచించారు. సంఘాలను నడిపించే బాధ్యత సభ్యులపై ఉందన్నారు.

మద్యం సేవించి వాహనం నడపొద్దు



వాహనదారుడిని పరీక్షిస్తున్న ఎస్సై

కెరమెరి: మద్యం సేవించి వాహనం నడపవద్దని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. లేండిగూడకు చెందిన డోబ్లె దీపక్ అతివేగంగా ఆటో నడుపుతుండగా అతన్ని ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. మద్యం సేవించినట్లు రుజువుకావడంతో ఆటో సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఎంఆర్‌పీ రవితేజ

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండో రోజు శిక్షణ కొనసాగింది. బుధవారం తెలుగు, ఆంగ్లం సబ్జెక్టుల గురించి వివరించారు. తెలుగులో ఎఫ్ఎల్ఎన్, సంసిద్ధత, పుస్తక వాచకం, లేఖనం, మూల్యాంకనం గురించి వివరించారు. ఆంగ్లంలో బేసిక్స్, లిజనింగ్ ప్యాసేజ్, ఆంగ్ల భాష సులభంగా నేర్పించే విధానం, కృత్యాధార బోధన, టెస్ట్ బుక్, హ్యాండ్‌బుక్, వర్క్‌షీట్ ఎలా ఉపయోగించాలి? అనే అంశాలపై క్లుప్తంగా శిక్షణ కల్పించారు. కోర్స్ డైరెక్టర్, ఎంఈవో ఆడే ప్రకాశ్ పర్యవేక్షణ చేశారు. ఈ శిక్షణలో మండల రిసోర్స్ పర్సన్‌లు శ్రీధర్, రవితేజ, వినీత్, నరేశ్, క్రాంతి, అరుణ్, ప్రత్యూశ, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజేయస్వామి ఆలయంలో గురువారం పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శిరీశ్ శర్మ తెలిపారు. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్ర తమళ తమలత్రార్చన ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ ప్రేమ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఇర్ఫాన్‌నగర్ కాలనీకి చెందిన తలహబిన్‌కాదిల్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బుధవారం పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ బాధితుడు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ అందజేయంతో బాధితుడు హర్షం వ్యక్తం చేశాడు.

తాత్కాలిక డ్రెయినేజీ ఏర్పాటు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ గ్రామ పంచాయతీ పరిధి ప్రధాన రహదారి పక్కన తాత్కాలిక డ్రెయినేజీని బుధవారం తవ్వించారు. ప్రధాన రహదారిపై ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని వ్యర్థాల నీటిని రోడ్డుపైకి వదలడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించిన ఎంపీడీవో ప్రసాద్ ఆసుపత్రి యజమానులకు పంచాయతీ సెక్రటరీ ద్వారా నోటీసులు జారీ చేశారు. దీంతో ఆసుపత్రి ముందు నుంచి ప్రధాన కాలువ ఒర్రె వరకు డ్రెయినేజీ ఏర్పాటు చేసి పైపులను వేయించారు.

సాగునీరు పారేదెలా..?

- అధ్వానంగా పీపీరావు ప్రాజెక్టు కాలువలు
- సాగు నీరందక రైతుల ఇబ్బందులు
- అక్కడక్కడ ధ్వంసమైన కాలువ
- పట్టించుకోని అధికారులు



కుంచవెల్లి -చంద్రపల్లి మధ్యలో తుంగగడ్డితో నిండిన కాలువ

దహెగాం: రైతులను ఆదుకోవడానికి గత ప్రభుత్వాలు వాగులు, ఒర్రెలపై ప్రాజెక్టులు, చెరువులను నిర్మించి సాగునీరు అందించేందుకు కాలువలు నిర్మించాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపు లేని కారణంగా కాలువలు అధ్వానంగా మారి సాగునీరు అందడం లేదు. కాలువలు పూడిక, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో కాలువలు ఇలా ఉంటే సాగు నీరు ఎలా పారుతుందని, పంటలు ఎలా పండుతాయని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకునే నాధుడే లేరని ఆరోపిస్తున్నారు.

11వేల ఎకరాలకు సాగునీరు..

పీపీరావు ప్రాజెక్టు ద్వారా మండలంలో వర్షాకాలంలో 11 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలి కానీ కాలువ సరిగా లేనందున సుమారు రూ.6 వేల నుంచి రూ.7 వేల ఎకరాల వరకు మాత్రమే సాగు నీరు అందుతుందని రైతులు పేర్కొంటున్నారు. కల్వాడ సమీపంలో కల్వర్టు వద్ద వర్షాకాలంలో వర్షపు నీరు అధికమై కాలువ ధ్వంసమవుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. కాలువ మట్టితో, పిచ్చి మొక్కల కారణంగా పూర్తి స్థాయిలో సాగు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువలో పూడిక తీస్తే మేలు..

ప్రధాన కాలువ అధ్వానంగా మారడంతో సాగు నీరు అందడం లేదు. వర్షాకాలం ప్రారంభం కంటే ముందే కాలువలో పూడిక మట్టి, పిచ్చి మొక్కలు తొలగిస్తే ఖరీఫ్‌లో రైతుల పొలాలకు సాగునీరు అందుతుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రతీ సంవత్సరం అధికారులకు, నాయకులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కాలువ తూము గేట్లు లేని కారణంగా నీరంతా వృథాగా పోతుందని వాపోతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధిహామీ పథకంలో కాలువల్లో పూడిక తీసి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా కాలువలు..

మండలంలోని కల్వాడ, సాలిగాం మధ్యలో ఎర్రవాగు, నల్లవాగులపై గత 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం పీపీరావు ప్రాజెక్టు నిర్మించింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం వైపు, దహెగాం మండలం వైపు రెండు ప్రధాన కాలువలు నిర్మించింది. మండలంలో కుంచవెల్లి, కల్వాడ, చంద్రపల్లి, లగ్గాం, గెర్రె, గిరవెల్లి, గ్రామాల వైపు ఉన్న కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. గత మూడు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు కాలువలు ధ్వంసం కాగా రైతులే మట్టి పోసి మరమ్మతులు చేపట్టారు. కాలువ ద్వారా సాగు నీరు అందిస్తున్నా మధ్యలో కాలువ చెడిపోయి ఉన్నందున పూర్తిస్థాయిలో సాగుకు నీరందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ ధ్వంసమైన కాలువకు మరమ్మతులు చేపట్టడం లేదని వాపోతున్నారు.

పూడిక తీయాలి..



కాలువ పక్కనే నాకు సాగు భూమి ఉంది. ఖరీఫ్, యాసంగిలో రెండు పంటలు సాగు చేస్తాను. కాలువ సరిగా లేనందున యాసంగిలో పంటలకు సరిగా సాగు నీరు అందడం లేదు. కుంచవెల్లి, చంద్రపల్లి, పీకలగుండం ప్రాంతంలో సాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలువలోని పూడిక, తుంగగడ్డి తీస్తే సాగు నీరు అందే అవకాశాలు ఉన్నాయి. దీంతో రెండు పంటలు పండిస్తాం. పెద్ద సార్లు దయ చూపాలి.

– దుర్గం కేదర్, రైతు, పీకలగుండం

ఎవరూ పట్టించుకోవడం లేదు



పీపీరావు ప్రాజెక్టు కాలువలు అధ్వానంగా తయారైనా పట్టించుకునే వారు లేరు. ప్రతీ సంవత్సరం సాగునీరు పూర్తి స్థాయిలో అందకపోవడంతో పంటలు నష్టపోతున్నాం. పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా వస్తలేవు. దీంతో వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేసున్నాం. కాలువ తూములకు గేట్లు లేనందున నీరంతా వృథాగా పోతుంది. ప్రభుత్వం స్పందించి కాలువల్లో చెత్తను తొలగించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– గొరకాల తిరుపతి, రైతు, చంద్రపల్లి

వేలాడుతున్న విద్యుత్ ప్రమాదం!



హత్తిని మల్లన్నవాడ సమీపంలో కుంట వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. హత్తిని మల్లన్నవాడలో ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని కుంట వద్ద సైతం తీగలు వేలాడుతున్నాయని అటువైపు పశువులు మేతకు వెళ్లినప్పుడు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌ను సంప్రదించగా విద్యుత్ తీగల కింద కుంట మట్టి పోయడంతో తీగలు కిందకు కనిపిస్తున్నాయన్నారు. గ్రామంలో వేలాడుతున్న తీగలను సరి చేస్తామని పేర్కొన్నారు.



హత్తిని మల్లన్నవాడలో కిందకు వేలాడుతున్న తీగలు

నేడు మండల సమాఖ్య ఎన్నికలు

కెరమెరి: కొంతకాలంగా ఊరిస్తున్న మండల సమాఖ్య ఎన్నికల నిర్వహణకు ఎట్టకేలకు రంగం సిద్ధమైంది. గురువారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికలతో పాటు మండల సర్వసభ్య సమావేశం కూడా నిర్వహించనున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 11 క్లస్టర్లు ఉన్నాయి. ఇందులో 34 మంది వీవోలు, 526 మంది ఎస్‌హెచ్‌జీలు, 5,626 మంది సభ్యులు ఉన్నారు.

చురుకైన వారు పోటీ చేయవచ్చు

గతేడాది నుంచి ఎంఎస్ ఎన్నికల చట్టంలో కొంత మార్పు చేశారు. 1995 చట్టం ప్రకారం వీవో అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర నాయకులు మాత్రమే మండల సమాఖ్య ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం ఇందులో కొంత సవరణ చేశారు. 2024 చట్టం ప్రకారం గ్రామైక్య సంఘంలో చురుకైన సభ్యులు కూడా ఎంఎస్ ఎన్నికలకు పోటీ చేయవచ్చు. వీవో అధ్యక్షుడు తీర్మానం చేసి వారిని ఎంఎస్ ఎన్నికలకు పంపించవచ్చు. ఇందుకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న మహిళా సంఘ సభ్యులకు సీసీలు రెండు రోజుల నుంచి అవగాహన కల్పిస్తున్నారు. ఆయా గ్రామాల్లో చేతులెత్తే విధానం ద్వారా ఎంఎస్‌కు పోటీ చేసే నాయికను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీవో అధ్యక్షులతో పాటు పోటీచేసే చురుకై న సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ పేర్కొన్నారు.

ఇసుక రవాణా చేస్తే చర్యలు



తాటిపల్లి వార్ధా నది వద్ద ఇసుకను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

కౌటాల: నదులు, వాగుల నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గనులశాఖ ఏడీఎస్ గంగాధరరావు అన్నారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ఇసుక దందా..!' కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కౌటాల మండలం తాటిపల్లి సమీపంలోని వార్ధా నదిలో ఇసుక తరలించిన ప్రదేశాలను పరిశీలించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే డ్రైవర్లపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రాల్లో ఇసుక నిల్వ చేయొద్దన్నారు. ప్రభుత్వ అనుమతితోనే ఇసుకను తరలించాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట అధికారులు ప్రశాంత్ ఉన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలని నిరసన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి జన్కాపూర్ వరకు రహదారిపై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే గుంతలు పూడ్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్, సీపీఎం నాయకులు రాజేందర్, టీకానంద్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఇంటింటికీ అంగన్‌వాడీ సరుకులు

- ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- ఈ నెల 31 వరకు కేంద్రాలకు సెలవులు

కెరమెరి: వేసవిలో రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండల తీవ్రతతో చిన్నారులు, వృద్ధులతో పాటు గర్భిణులు, బాలింతలపై ఎక్కువ ప్రభావం చూపనుంది. దీంతో ప్రభుత్వం ఈ నెల 1 నుంచి 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించింది. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో గర్భిణులు 296 మంది, బాలింతలు 303 మంది, 0–6 ఏళ్ల గల చిన్నారులు 4,145 మంది, కిషోర బాలికలు 1,145 మంది ఉన్నారు.

ఇంటింటికీ వెళ్లి..

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నెలరోజుల పాటు సెలవులు ప్రకటించడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం పంపిణీలో ఇబ్బందులు ఉండకూడదని అంగన్‌వాడీ కార్యకర్తలు వండిన భోజనం కాకుండా వంట సామగ్రిని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందిస్తున్నారు. 15 రోజులు టీచర్, 15 రోజులు ఆయాలు అందుబాటులో ఉండి బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, బాలామృతం అందిస్తున్నారు. ఇటీవల కేంద్రాలకు సురుకులు పంపిణీ కావడంతో బుధవారం మండలంలోని అనేక చోట్ల సరుకులు పంపిణీ చేశారు.



సకారాంగూడలో సరుకులు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ ఆయా

ఎంత ఇస్తున్నారంటే..

ప్రీస్కూల్ పిల్లలకు 75 గ్రా ముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రామాలు నూనె, 20 గ్రాముల మురుకులు, రోజుకు ఒక గు డ్డు అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల పి ల్లలకు నెలకు 16 కోడిగుడ్లు, బాలామృతం అంది స్తున్నారు. ఇక బాలింతలు, గర్భిణులకు 150 గ్రా ముల బియ్యం, 16 గ్రా ముల నూనెతో పాటు పా లు గుడ్లు అందిస్తున్నారు.

పంపిణీని పర్యవేక్షిస్తున్నాం



వేసవి దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించినప్పటికీ సరుకులు మాత్రం యధావిధిగా అందిస్తున్నాం. ఎండల తీవ్రత కారణంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడవద్దని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సరుకులు అందిస్తున్నారు. సిబ్బంది అందుబాటులో ఉండి వాహనం రాగానే సరుకులను దించుకోవాలి. విధిగా రికార్డులో నమోదు చేయాలి. సరుకుల పంపిణీని పర్యవేక్షిస్తున్నాం.

– కుమారి, సూపర్‌వైజర్

వర్షం.. బీభత్సం

దహెగాం మార్కెట్‌లో విరిగిపడ్డ చెట్టు



రెబ్బెన: కురుస్తున్న భారీ వర్షం



ఎల్లూర్ వద్ద తెగిపడిన విద్యుత్ వైర్లు



బురదమయంగా మారిన లోడుపల్లి -కొండపల్లి రహదారి



భారీ వర్షానికి దహెగాం మండల కేంద్రంలో మార్కెట్ ఏరియాలో వేప చెట్టు నేలకొరిగింది. భారీ వర్షం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ వేడిమితో ఇబ్బందులు పడ్డ ప్రజలకు భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ ఆశ్రమ పాఠశాల వద్ద విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వర్షానికి లోడుపల్లి నుంచి కొండపల్లి వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రెబ్బెన మండలంలో బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలో కోతలకు సిద్ధంగా ఉన్న పంటపొలాలు తడిసి ముద్దయ్యాయి. అమ్మేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని వర్షం బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. అకాల వర్షానికి బలమైన ఈదురు గాలులు తోడవడంతో వరిపైరు నేలకొరిగింది. మరాడించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యంతో కూడిన గడ్డివాములు తడిసి ముద్దవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చింతలమానెపల్లి మండలంలో భారీ గాలులు రావడంతో మండలంలోని పలు గ్రామాలలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఖర్జెల్లి గ్రామంలో 10కి పైగా ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. రవీంద్రనగర్ సమీపంలో రహదారిపై చెట్లు కూలిపోయాయి. గూడెం మార్గంలో చెట్లు కూలడంతో రవాణాకు ఆటంకం కలిగింది. కాగజ్‌నగర్ పట్టణంలో ఈదురుగాలులు వీయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గాలి వానకు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

– దహెగాం/పెంచికల్‌పేట్/ రెబ్బెన/ చింతలమానెపల్లి/కాగజ్‌నగర్‌టౌన్

అటవీ అధికారుల అడ్డగింత



అటవీ అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామం సమీపంలో బుధవారం అటవీ అధికారులను గ్రా మస్తులు అడ్డుకున్నారు. గత రెండు రోజులుగా బందెపల్లి బీట్ అటవీ పరిధిలో అధికారులు పనులు నిర్వహిస్తున్నారు. ఖర్జెల్లి అటవీరేంజ్ ఇన్‌చార్జి ఇక్బాల్, డి ప్యూటీ రేంజర్ హైమావతి, అటవీ సిబ్బంది గ్రామంలోని రైతులు పోడు భూములకు వెళ్లే దారిలో జేసీబీతో కందకాలు నిర్మిస్తున్నారు. అధికారులు హద్దులుగా కందకాలను నిర్మిస్తుండడంతో గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. గ్రామస్తులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనులపై వివరించారు. అయినా గ్రామస్తులు విన్పించుకోలేదు. దీంతో అటవీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి రాకపోవడంతో అటవీ అధికారులు పనులు నిలిపివేశారు.